సాక్షి
కామారెడ్డి
బుధవారం । 21 । ఆగస్టు । 2024






**అలంకారప్రాయంగా..**
బాన్సువాడ పట్టణంలో వాహనదారులు ఇష్టారాజ్యంగా వాహనాలను నడుపుతూ ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్నారు.
- 9లో ▸



**రాజీవ్ హయాంలోనే..**
జిల్లాలో మంగళవారం రాజీవ్‌గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయనకు నివాళులు అర్పించారు.
- 9లో ▸

**వాతావరణం**
గరిష్టం/కనిష్టం
37.7 /22.6
ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

# మాఫీ మంటలు!

రుణమాఫీ మంటలు రోజురోజుకు ఎగసిపడుతున్నాయి. పంట రుణం మాఫీ కాని రైతులు ఆందోళనలు ఉధృతం చేస్తున్నారు. ఎలాంటి షరతులు లేకుండా అర్హులందరికీ లబ్ధి చేకూర్చాలని డిమాండ్ చేస్తూ మూడో రోజూ జిల్లాలోని పలు ప్రాంతాలలో నిరసన కార్యక్రమాలు కొనసాగాయి.


నస్రుల్లాబాద్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

**రోడ్డెక్కుతున్న అన్నదాతలు**
- అర్హులందరి పంట రుణాలు మాఫీ చేయాలని డిమాండ్
- సంఘీభావం తెలుపుతున్న పార్టీలు
- నేడు చలో కలెక్టరేట్‌కు భారతీయ కిసాన్ సంఘ్ పిలుపు
- రేపు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసనలు..

**సాక్షి ప్రతినిధి, కామారెడ్డి :** పంట రుణాల మాఫీ అవకాశం కోల్పోయిన రైతుల్లో ప్రభుత్వంపై ఆగ్రహం పెరుగుతోంది. ఊరూరా వందలాది మంది రుణాలు మాఫీ కాకపోవడంతో వారంతా ఒక్కతాటిపైకి వస్తున్నారు. కొర్రీలు పెట్టి అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు.. అధికారులకు వినతులు అందిస్తూనే పోరాటానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పలుచోట్ల ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. దీంతో రుణమాఫీ మంటలు ఒక్కో ఊరు నుంచి మరో ఊరుకు వ్యాప్తి చెందుతున్నాయి. జిల్లాలో మూడు రోజులుగా పలు చోట్ల రైతులు ఆందోళనలు చేస్తున్నారు.

సదాశివనగర్ మండలం వజ్జెపల్లి తండాలో ఆదివారం రైతులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన విషయం తెలిసిందే. సోమవారం పిట్లం మండలం రాంపూర్(కలాన్) గ్రామంలో రైతులు తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట నిరసనకు దిగారు. మంగళవారం తాడ్వాయి మండల కేంద్రంలో వందలాది మంది రైతులు కలిసి ఎల్లారెడ్డి -కామారెడ్డి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. అనంతరం రెవెన్యూ కార్యాలయం వరకు ర్యాలీ తీసి, తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. నస్రుల్లాబాద్ మండల కేంద్రంలోనూ రైతులు రాస్తారోకో చేశారు. దోమకొండ కెనరా బ్యాంకు వద్ద, సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డిలోని గ్రామీణ బ్యాంకు వద్ద రైతులు నిరసన తెలిపారు. రకరకాల కారణాలతో రైతుల రుణాలు చాలా వరకు మాఫీ జరగకపోవడంతో రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. అర్హులైనప్పటికీ రుణాలు మాఫీ కాకపోవడంతో ఆవేదన చెందుతున్న రైతులు రోజూ ఎక్కడోచోట నిరసనలకు దిగుతున్నారు.

**వివరాలు తీసుకుంటున్న అధికారులు**

పంట రుణం మాఫీ కాని రైతుల నుంచి వ్యవసాయ శాఖ అధికారులు వివరాలు తీసుకుంటున్నారు. ఈ విషయమై ప్రభుత్వం మండలానికో అధికారిని కేటాయించిన విషయం తెలిసిందే. వారు మండలంలో అందుబాటులో ఉండి రుణమాఫీ కాని రైతులనుంచి వివరాలను సేకరిస్తున్నారు. ఏ కారణంతో మాఫీ వర్తించలేదన్న వివరాలను చెప్పడంతోపాటు కావాల్సిన డాక్యుమెంట్స్ తీసుకుంటున్నారు. అర్హులందరికీ రుణమాఫీ అవుతుందన్న విషయాన్ని చెప్పి పంపిస్తున్నారు.

**పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో..**

బీజేపీ ఆధ్వర్యంలో బాన్సువాడలో సోమవారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నేతలు, రైతులు పంట రుణాల మాఫీపై చర్చించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ సమస్యపై చలో కలెక్టరేట్‌కు భారతీయ కిసాన్ సంఘ్ పిలుపునిచ్చింది. బుధవారం ఉదయం 10 గంటలకు డిగ్రీ కళాశాల మైదానం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ తీయనున్నట్లు కిసాన్ సంఘ్ ప్రతినిధులు తెలిపారు. ఆందోళనలో రైతులు భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరారు. రైతులందరి పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లావ్యాప్తంగా ఆందోళనలకు బీఆర్‌ఎస్ పిలుపునిచ్చింది. దీంతో మండల, నియోజకవర్గ కేంద్రాల్లో ఆందోళనలకు ఆ పార్టీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు.

## నస్రుల్లాబాద్‌లో ఆందోళన

**నస్రుల్లాబాద్:** పంట రుణాల మాఫీ విషయంలో ప్రభుత్వం మాట తప్పిందంటూ రైతులు నస్రుల్లాబాద్‌లో ఆందోళనలు చేశారు. తమ క్రాప్ లోన్ ఎందుకు మాఫీ కాలేదో తెలుసుకోవడానికి రైతులు రోజూ వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వరుసగా సెలవులు రావడంతో అధికారులు అందుబాటులో లేక ఇబ్బందిపడ్డారు. మంగళవారం రైతు వేదికకు భారీగా తరలివచ్చారు. ఎందుకు మాఫీ కాలేదన్న విషయమై అధికారులు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో రైతులు ఏఈవోలతో వాగ్వాదానికి దిగారు. అధికారులు లోపల ఉండగా రైతు వేదికకు తాళం వేయడానికి యత్నించారు. నూతన ఏఈవో గోపాల్‌కు బాధ్యతలు అప్పగించడానికి తాను వచ్చానని బదిలీపై వెళ్లిన ఏఈవో దత్తేశ్వరి చెప్పారు. మాఫీ కాని రైతులు వివరాలు ఇవ్వాలని సూచించడంతో రైతులు శాంతించారు.

**బ్యాంకు వద్ద రాస్తారోకో**

బ్యాంకు అధికారుల కారణంగానే తమ రుణాలు మాఫీ కాలేదని ఆరోపిస్తూ నస్రుల్లాబాద్ రైతులు రాస్తారోకో చేశారు. రూ. 2 లక్షలకు పైగా లోన్ ఉంటే.. అప్పులు చేసి మరీ పైన మొత్తాన్ని చెల్లించామని పేర్కొన్నారు. అయినా లోన్ మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేస్తామని చెప్పి సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేశారని ఆరోపించారు. న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం రుణ మాఫీ అయ్యేలా చూడాలంటూ బ్యాంకు మేనేజర్‌కు వినతి పత్రం అందించారు.


నస్రుల్లాబాద్ రైతు వేదికలో ఏఈవోలతో వాగ్వాదానికి దిగిన రైతులు

**న్యాయం చేయాలి**



నాకు మూడెకరాల భూమి ఉంది. రూ. 1.90 లక్షల పంట రుణం తీసుకున్నా. క్రమం తప్పకుండా రెన్యువల్ చేస్తున్నా. అయినా నా లోన్ మాఫీ కాలే. సర్కారు న్యాయం చేయాలి.
– పరశురాం, రైతు, లింగంపల్లి తండా

**మాఫీ కాలేదు**



నా భార్య గడ్డం భూదేవి పేరిట రెండెకరాల భూమి ఉంది. రూ. 65 వేల క్రాప్‌లోన్ తీసుకున్నాను. కానీ ఆ రుణం మాఫీ కాలేదు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు.
– వీరా గౌడ్, రైతు, మైలారం

## దోమకొండలో ధర్నా

**దోమకొండ:** మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు వద్ద మంగళవారం రైతులు ధర్నా చేశారు. రూ. 2 లక్షలలోపు అప్పే ఉన్నా ఎందుకు మాఫీ కాలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. సుమారు రెండు గంటల పాటు బ్యాంకు ఎదుట ఆందోళన చేశారు. దోమకొండ మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన దాదాపు వందమంది రైతులు ఆందోళనలో పాల్గొన్నారు. వ్యవసాయశాఖ అధికారుల రుణమాఫీ జాబితాలో తమ పేరుందని, కాని బ్యాంకులో మాత్రం మాఫీ కాలేదంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హత ఉన్నా ఎందుకు రుణమాఫీ కాలేదంటూ బ్యాంకర్లతో వాగ్వాదానికి దిగారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని బ్యాంకు మేనేజర్ రాజేష్ చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.


దోమకొండ కెనరా బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

## కామారెడ్డి బంద్ విజయవంతం

**కామారెడ్డి టౌన్ :** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన దాడులను నిరసిస్తూ మంగళవారం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో నిర్వహించిన బంద్ విజయవంతమైంది. విద్య, వాణిజ్య, వ్యాపార సంస్థలను స్వచ్ఛందంగా మూసి ఉంచి బంద్‌లో పాల్గొన్నారు. సుభాష్ విగ్రహం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు బైఠాయించి నిరసన తెలిపారు. బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వ్యాపారులు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందజేశారు. బంద్ కారణంగా నిత్యం రద్దీగా ఉండే సుభాష్‌రోడ్, జేపీఎన్ రోడ్, మాయాబజార్, సిరిసిల్ల రోడ్, పాతబస్టాండ్, స్టేషన్‌రోడ్, నిజాంసాగర్ చౌరస్తా, జాతీయ రహదారి, కొత్త బస్టాండ్ తదితర ప్రాంతాలన్నీ బోసిపోయాయి. బంద్‌లో కామారెడ్డి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కంచర్ల లింగం, ప్రధాన కార్యదర్శి సుకుమార్‌గౌడ్, కోశాధికారి నర్సింలు, వ్యాపారులు పాల్గొన్నారు.


ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం ఇస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు


కామారెడ్డిలోని సుభాష్‌రోడ్‌లో మూసి ఉన్న దుకాణాలు

## పెద్దాయనకు కేబినెట్ హోదా

- వ్యవసాయ శాఖ ప్రభుత్వ సలహాదారుగా నియామకం
- రెండేళ్ల పాటు పదవిలో కొనసాగనున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

**సాక్షి ప్రతినిధి, కామారెడ్డి:** ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో సీనియర్ నేత అయిన బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి క్యాబినెట్ హోదా దక్కింది. వ్యవసాయ శాఖ సలహాదారుగా నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఈ పదవిలో రెండేళ్ల పాటు కొనసాగనున్నారు.

పోచారం శ్రీనివాస్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం సహకార సంఘం చైర్మన్‌గా మొదలైంది. ఆయన తొలిసారిగా 1994అసెంబ్లీ ఎన్నికలలో టీడీపీ అభ్యర్థిగా బాన్సువాడ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యే అయ్యారు. గెలిచిన కొంతకాలం తర్వాత మంత్రి కూడా అయ్యారు. 1999 బాన్సువాడ ఎమ్మెల్యేగా రెండోసారి గెలిచి, మంత్రిగా పనిచేశారు. 2004లో ఓటమి పాలైన పోచారం.. 2009లో తిరిగి గెలిచారు. 2011 లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి టీఆర్‌ఎస్‌లో చేరారు. ఉప ఎన్నికల్లోనూ విజయం సాధించారు. 2014 గెలుపొంది తెలంగాణ తొలి ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశారు. 2018 ఎన్నికల్లోనూ విజయం సాధించిన పోచారం అసెంబ్లీ స్పీకర్‌గా ఐదేళ్లు కొనసాగారు. స్పీకర్‌గా పనిచేసిన వారు గెలవరనే సెంటిమెంట్‌ను అధిగమించి 2023 ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించారు. అయితే రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాకపోవడంతో ఆయన కొంత నిరుత్సాహానికి గురయ్యారు. స్థానికంగా మారిన రాజకీయాలతో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కాంగ్రెస్‌లో చేరిన ఆయనకు కీలక పదవి వస్తుందని ప్రచారం జరిగింది. అనుకున్నట్లుగానే ప్రభుత్వం కేబినెట్ హోదాతో కూడిన ప్రభుత్వ సలహాదారుగా నియమించింది. వ్యవసాయ శాఖకు సంబంధించి ఆయన సలహాదారుగా వ్యవహరిస్తారు. పోచారంకు ప్రభుత్వ సలహాదారు పదవి దక్కడంతో ఆయన అనుచరుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. బాన్సువాడకు చెందిన తెలంగాణ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజు పోచారం శ్రీనివాస్‌రెడ్డికి స్వీట్ తినిపించి అభినందనలు తెలిపారు.


బాన్సువాడలో పోచారం శ్రీనివాస్‌రెడ్డికి స్వీట్ తినిపిస్తున్న కాసుల బాల్‌రాజ్

**జిల్లానుంచి ఇద్దరు ప్రభుత్వ సలహాదారులు..**

ఇప్పటికే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల సంక్షేమానికి సంబంధించి ప్రభుత్వ సలహాదారుగా కామారెడ్డికి చెందిన సీనియర్ నేత షబ్బీర్ అలీ కొనసాగుతున్నారు. ప్రభుత్వం తాజాగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని వ్యవసాయ శాఖ సలహాదారుగా నియమించింది. దీంతో జిల్లాలో ఇద్దరు నేతలకు కీలక పదవులు దక్కినట్టయ్యింది.

## 'ఎల్‌ఆర్‌ఎస్' స్క్రూటినీ పకడ్బందీగా చేపట్టాలి..

- మూడు నెలల్లో ప్రక్రియ పూర్తి చేయాలి
- వీసీలో రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**కామారెడ్డి క్రైం :** ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల స్క్రూటినీని పకడ్బందీగా నిర్వహించాలని రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించుకోవాలన్నారు. మంగళవారం ఆయన ఖమ్మం కలెక్టరేట్ నుంచి సీఎస్ శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఎల్‌ఆర్‌ఎస్, భారీ వర్షాలు, ధరణి, ఆర్‌వోఆర్ చట్టం తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులలో అవసరమైన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో పర్యటించి, జీపీఎస్ ద్వారా సదరు భూమి వివరాలు పక్కాగా నమోదు చేయాలని సూచించారు. అదే సమయంలో సదరు భూములు నీటి వనరులకు చెందిన బఫర్ జోన్, నాలా, చెరువులు, హెరిటేజ్ బిల్డింగ్, డిఫెన్స్ ల్యాండ్ పరిధిలోవి కావని ధ్రువీకరించాలన్నారు. ఈ ప్రక్రియను మూడు నెలల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రాబోయే ఐదు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిశీలన వెంటనే పూర్తి చేయాలన్నారు. ఒకవేళ తిరస్కరిస్తే అందుకు గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలన్నారు.

**23, 24 తేదీలలో వర్క్‌షాప్..**

భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నూతన ఆర్‌వోఆర్ చట్టం ముసాయిదా బిల్లును ప్రతిపాదించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. దీనిపై జిల్లాల్లో 23, 24 తేదీలలో వర్క్‌షాప్‌లు నిర్వహించాలని సూచించారు. ముసాయిదా బిల్లులో చేయాల్సిన మార్పులు, చేర్పులు ఏమైనా ఉంటే రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శికి అందజేయాలని సూచించారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

**అప్రమత్తంగా ఉండాలి..**

రానున్న ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంత్రితో వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి జిల్లాలోని పోచారం, నిజాంసాగర్, కౌలాస్ ప్రాజెక్టుల్లో నీటిమట్టం వివరాలను తెలుసుకున్నారు. పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఉండే ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. జ్వరాలు వ్యాప్తి చెందిన గ్రామాలను గుర్తించి ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. పరిసరాలను ప్రతి ఒక్కరూ శుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో ఫాగింగ్ చేయించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, నీటిపారుదల శాఖ ఎస్‌ఈ శ్రీనివాస్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రేమ్‌కుమార్, ఉమాలత తదితరులు పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### 'మెనూ ప్రకారం భోజనం అందించాలి'



**దోమకొండ:** విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి, డీపీవో భాగ్యలక్ష్మి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతిగృహం, సీతారంపల్లిలోని కేజీబీవీని ఆమె ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. పరిసరాలను పరిశీలించారు. హాస్టల్ పరిసరాల్లో పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించాలని సూచించారు. సంఘమేశ్వర్ గ్రామంలో కంపోస్ట్ షెడ్‌ను పరిశీలించారు. సేంద్రియ ఎరువు తయారీపై సూచనలు ఇచ్చారు. గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. వైకుంఠధామం పరిశీలించి దాని చుట్టూ ఫెన్సింగ్ చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపల్ మమత, పంచాయతీ కార్యదర్శి వసంత తదితరులు పాల్గొన్నారు.

### ఎల్‌ఆర్‌ఎస్ కోసం హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు



**కామారెడ్డి క్రైం:** ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) కోసం జిల్లాలో నాలుగు హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించి ఏవైనా సమస్యలు, సందేహాలు ఉంటే దరఖాస్తుదారులు ఆయా నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

**సంప్రదించాల్సిన సెల్ నంబర్లు..**

| హెల్ప్‌డెస్క్ | ఫోన్ నంబర్ |
|---|---|
| కలెక్టరేట్ | 89859 14729 |
| కామారెడ్డి | 98858 17455 |
| ఎల్లారెడ్డి | 94418 01160 |
| బాన్సువాడ | 63017 07191 |

**'ఎల్‌ఆర్‌ఎస్ చేసుకోవాలి'**

**కామారెడ్డి టౌన్:** అక్రమ లేఅవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం 2020లో దరఖాస్తు చేసుకున్నవారు మున్సిపాలిటీలో సంప్రదించి, క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. షార్ట్‌ఫాల్స్, తిరస్కరణకు గురైన దరఖాస్తులకు కూడా ప్రభుత్వం అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు.

### ఆర్ట్స్ కళాశాల పరీక్షల నియంత్రణ అధికారిగా కిష్టయ్య



**కామారెడ్డి అర్బన్:** కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (స్వయం ప్రతిపత్తి) పరీక్షల నియంత్రణ అధికారిగా పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు కిష్టయ్యను నియమితులయ్యారు. ఈ మేరకు ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

### 'నీటి సంఘాల పాత్ర కీలకం'



**నిజాంసాగర్:** ప్రధాన జలాశయాలతో పాటు మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణ, ఆయకట్టుకు సాగు నీటి సరఫరా అంశాలలో నీటి సంఘాల పాత్ర కీలకమని తమిళనాడు రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ చీఫ్ ఇంజినీర్ ఎస్.రాజా పేర్కొన్నారు. మంగళవారం తమిళనాడు నీటిపారుదలశాఖ అధికారులు, ట్రెనింగ్ సెంటర్ అధికారులు నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. రైతులతో మాట్లాడి నీటి సంఘాల పనితీరు, వాటి వల్ల కలిగిన ప్రయోజనాల గురించి తెలుసుకున్నారు. నీటి సంఘాలను పునరుద్ధరించాలని ప్రభుత్వానికి సూచించారు. వారి వెంట నిజాంసాగర్ నీటి పారుదలశాఖ ఈఈ సోలోమాన్, ఏఈ శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

## క్లుప్తంగా

### కాంగ్రెస్ నుంచి ఏఎంసీ మాజీ చైర్మన్ సస్పెన్షన్

మద్నూర్(జుక్కల్): కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలు చేయడం తగదని పార్టీకి నష్టం కలిగించే వారిపై అధిష్టానం ఉపేక్షించదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దరాస్ సాయిలు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీకి నష్టం కలిగిస్తున్న మద్నూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంగమేశ్వర్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. లింగాయత్ సమాజ్ నాయకులను ఎమ్మెల్యే అణచివేస్తున్నారని, వారికి గౌరవం ఇవ్వడం లేదని తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. అధిష్టానం ఆదేశాలతో పార్టీ నుంచి సస్పెండ్ చేశామన్నారు. మాజీ ఎంపీపీ ప్రజ్ఞకుమార్, నాయకులు హన్మండ్లుస్వామి, రాంపటేల్, తదితరులున్నారు.

### అజ్ఞాత వ్యక్తుల ఫోన్‌కాల్స్‌కు స్పందించొద్దు

బాన్సువాడ రూరల్: డ్రగ్స్ పార్శిల్స్ వచ్చాయంటూ, మీ కుటుంబ సభ్యులు డ్రగ్స్ వాడుతూ దొరికిపోయారంటూ అజ్ఞాత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌కు ఏమాత్రం స్పందించొద్దని బాన్సువాడ సీఐ కృష్ణ అన్నారు. ఇటీవల చోటుచేసుకుంటున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంగళవారం బాన్సువాడ పోలీస్‌స్టేషన్‌లో చెప్పారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోతున్న అమాయకుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోవడం బాధాకరమన్నారు. ఎవరైనా అనుమానిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వచ్చినా, లేక మీరు మోసపోయినా వెంటనే 1930కు కాల్‌చేసి ,స్థానిక పోలీసులను సంప్రదించాలన్నారు.

### గోకులాష్టమి వేడుకలకు ఏర్పాట్లు

భిక్కనూరు: జంగంపల్లి బ్రహ్మజ్ఞానాశ్రమంలో గోకులాష్టమిని ఈనెల 26న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆశ్రమ ట్రస్టు అధ్యక్షుడు రంగు హన్మగౌడ్, ప్రధాన కార్యదర్శి గంగుల జనార్దన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. గోకులాష్టమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

### ఘనంగా కన్యకాపరమేశ్వరి పూజలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేటలో మంగళవారం ఆర్యవైశ్యులు కన్యకా పరమేశ్వరిమాత పూజలను ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని ఆర్యవైశ్యసంఘం కల్యాణ మండపంలో మహిళలు సామూహికంగా అమ్మవారి పూజలు చేశారు. కన్యకా పరమేశ్వరి మాతను అందంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో వారు అమ్మవారిని కొలిచారు. దీంతోపాటు సాహూహిక కుంకుమార్చనలు చేశారు.

### 23న ఆర్వోఆర్ ముసాయిదా బిల్లుపై వర్క్‌షాప్

కామారెడ్డి క్రైం: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రూపొందించిన ఆర్వోఆర్ ముసాయిదా బిల్లుపై కామారెడ్డి కలెక్టరేట్‌లో ఈ నెల 23న మధ్యాహ్నం 2 గంటలకు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నటుల్ కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంగళవారం తెలిపారు. ముసాయిదా యాక్టుపై సూచనలు, సలహాలు స్వీకరించడానికి వర్క్ షాప్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రెవెన్యూ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, న్యాయవాదులు, రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.



# భారం కానున్న ఎల్‌ఆర్‌ఎస్

■ మోర్తాడ్‌కు చెందిన లక్ష్మి 18 ఏళ్ల క్రితం కొందరు వ్యాపారులు విక్రయించిన ప్లాట్‌ను కొనుగోలు చేసింది. అప్పట్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు లేఅవుట్ చేయకుండానే వ్యవసాయ భూమిని ప్లాట్లుగా మార్చి విక్రయించారు. 150 గజాల ఇంటి స్థలం కొనుగోలు చేసిన లక్ష్మి ఈ ప్లాట్ కోసం రూ.18 వేలను చెల్లించింది. అదనంగా మరో రూ.2,500లు ఖర్చు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకుంది.

■ చౌట్‌పల్లికి చెందిన గంగారాం బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లాడు. కమ్మర్‌పల్లిలో అతనికి ఇంటి స్థలం కొనుగోలు చేయాలని నిర్ణయించి బంధువుల ద్వారా వ్యాపారులకు రూ.20 వేలు చెల్లించి 120 గజాల స్థలాన్ని 20 ఏళ్ల క్రితం కొనుగోలు చేశాడు. అప్పట్లో స్థలం రిజిస్ట్రేషన్ కోసం రూ.2,800 ఖర్చు చేశాడు.

ఇలా లక్ష్మి, గంగారాం తాము కొనుగోలు చేసిన ఇంటి స్థలాలకు హక్కుదారులమని చెప్పడానికి రిజిస్ట్రేషన్ కాగితాలు తమ వద్ద ఉంచుకున్నారు. ఇంటి అనుమతి కోసం ఎల్‌ఆర్‌ఎస్ కింద ప్రభుత్వానికి భారీ మొత్తంలో పైకం చెల్లించాలనే విషయం ఇటీవలే వీరికి తెలిసింది.

- పెరిగిన మార్కెట్ ఫీజు ప్రకారం క్రమబద్ధీకరణ
- గత ప్రభుత్వ హయాంలో భారీగా దరఖాస్తుల స్వీకరణ
- క్రమబద్ధీకరణ పేరిట ప్రభుత్వ ఖజానాకు సొమ్మును జమ చేయాల్సిన పరిస్థితి


మోర్తాడ్‌లో ప్లాట్లుగా మార్చిన వ్యవసాయ భూమి

మోర్తాడ్: ఎల్‌ఆర్‌ఎస్ అమలుతో లేఅవుట్ చేయని ఇంటి స్థలాలు, వెంచర్లను క్రమబద్ధీకరణ చేసుకోవాలని ప్రభుత్వం నిర్దేశించింది. గత ప్రభుత్వం నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీల్లో అమలు చేయగా తాజా ప్రభుత్వం ఆదాయ మార్గాలను అన్వేషించి ఎల్‌ఆర్‌ఎస్(లేఅవుట్ రెగ్యులైజేషన్ స్కీం)ను గ్రామీణ ప్రాంతాలకు వర్తింప చేయాలని నిర్ణయించింది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీని కోసం పంచాయతీ కార్యదర్శులు, నీటిపారుదల శాఖ ఇంజినీర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌తో ఓ కమిటీని వేసింది. వీరు ఎల్‌ఆర్‌ఎస్ కోసం గతంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి మార్కెట్ విలువ ప్రకారం ప్రభుత్వానికి చలాన్ జమ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ నిర్ణయంతో గ్రామీణ ప్రాంతాల్లో లేఅవుట్ చేయని వారికి ఇది భారంగా మారనుంది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. ఒక్కో ప్లాట్‌కు మార్కెట్ ధర రూ.6వేల నుంచి రూ.20వేల వరకు క్రమబద్ధీకరణ ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. అంటే గతంలో కొనుగోలు చేసిన ప్లాట్‌కు చెల్లించిన ధరతో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు సమానమయ్యే అవకాశం ఉంది.

**అప్పట్లో వ్యతిరేకించి..**

గత ప్రభుత్వం 2020లో లేఅవుట్ చేయకుండా విక్రయించిన ఇంటి స్థలాలను కొనుగోలు చేసిన వారు క్రమబద్ధీకరణ చేసుకోవడానికి అవకాశం కల్పించింది. ఎల్‌ఆర్‌ఎస్ అమలు కేవలం నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీలలోనే అమలు చేశారు. గత ప్రభుత్వ ఆదాయ మార్గాలను అన్వేషించి ఎల్‌ఆర్‌ఎస్‌ను గ్రామీణ ప్రాంతాలకు వర్తింప చేయాలని నిర్ణయించింది.

అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ ఎల్‌ఆర్‌ఎస్‌ను తీవ్రంగా వ్యతిరేకించింది. లేఅవుట్ లేని ఇంటి స్థలాలను కొనుగోలు చేసిన వారు ప్రభుత్వానికి దరఖాస్తు ఫీజు కింద రూ.వెయ్యి చొప్పున చలాన్ చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలోని 530 జీపీల పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం 19వేల దరఖాస్తులు ప్రభుత్వానికి అందాయి. మున్సిపల్‌లో అదనంగా మరో 7వేల వరకు దరఖాస్తులు అందినట్లు అంచనా. ప్రజలపై భారం మోపే విధంగా ఉన్న ఎల్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేసిన నాటి కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత అదే విధానం అమలు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**స్థల యజమానికి ఎంతో మేలు**

ఎల్‌ఆర్‌ఎస్ అమలు చేయడానికి గతంలోనే జీవోలు జారీ అయ్యాయి. వాటి ప్రకారం మార్కెట్ ధరను లెక్కించి ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు ఎంత అనేది తేల్చాల్సి ఉంటుంది. క్రమబద్ధీకరణ చేసుకోవడం వల్ల స్థల యజమానికి ఎంతో మేలు జరుగుతుంది.
– తరుణ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి

## ‘రూ.2 లక్షల లోపు రుణాలు మాఫీ అవుతాయి’

కామారెడ్డి అర్బన్: రూ.2 లక్షల లోపు పంట రుణాల మాఫీ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని కామారెడ్డి ఏడీఏ అపర్ణ అన్నారు. మంగళవారం ఆమె ఒక ప్రకటన చేశారు. అబద్ధపు ప్రచారాలను నమ్మవద్దని, మాఫీ కానివారికి ఆధార్ నంబర్, రైతు పాస్‌బుక్ ఉండి, సాంకేతిక కారణాలతో బ్యాంకు ఖాతా నంబర్, ఆధార్ నంబర్‌లు తప్పుగా ఉంటే వారివి సరిచేసే అవకాశం ఉన్నందున వ్యవసాయ అధికారులను కలసి విన్నవించాలన్నారు. ఆధార్ లేని వారు ఓటర్ గుర్తింపుకార్డు లేదా వాహన లైసెన్స్, కుటుంబ రేషన్‌కార్డులను అందజేయవచ్చన్నారు. రైతుల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును నెల రోజుల్లో పరిష్కరిస్తామన్నారు.

## సివిల్ సప్లయ్ డీఎంగా రాజేందర్

కామారెడ్డి క్రైం: సివిల్ సప్లయ్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్‌గా జి.రాజేందర్ నియమితులయ్యారు. ఆయన మేడ్చల్ జిల్లా డీఎంగా పని చేసి కామారెడ్డికి బదిలీపై వస్తున్నారు. ఇది వరకు ఇక్కడ డీఎంగా పనిచేసిన అభిషేక్ సింగ్ కొద్ది రోజుల క్రితం హైదరాబాద్‌కు బదిలీ కాగా అప్పటినుంచి ఏఎస్‌వో నిత్యానందం ఇన్‌చార్జిగా కొనసాగారు.

**ఏఎస్‌వో బదిలీ**

జిల్లా పౌర సరఫరాల శాఖ ఏఎస్‌వోగా పనిచేస్తున్న నిత్యానందం జగిత్యాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హన్మకొండ ఏఎస్‌వోగా పనిచేస్తున్న నరసింహారావును కామారెడ్డి ఏఎస్‌ఓగా బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

### రుణమాఫీ కాని రైతుల సందేహాలు తీర్చేవారేరి?

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): రుణమాఫీ కాని రైతులకు సమాచారం ఇచ్చే అధికారులెవరని నాగిరెడ్డిపేట మాజీ జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి ప్రశ్నించారు. రుణమాఫీ కాని పలువురు రైతులు మంగళవారం మండల వ్యవసాయ కార్యాలయానికి రాగా కార్యాలయంలో అధికారులెవరూ అందుబాటులో లేరు. దీంతో అక్కడే ఉన్న మాజీ జెడ్పీటీసీకి రైతులు వారి సమస్యను చెప్పుకున్నారు. అధికారులు అందుబాటులో ఉండాలని ఆయన కోరారు.

### రైతులందరికి లబ్ధి చేకూర్చాలి

మాచారెడ్డి: ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం గజ్యానాయక్ తండా చౌరస్తాలో చాకలి ఐలమ్మ విగ్రహానికి వినతి పత్రం సమర్పించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొందరికి మాత్రమే రుణమాఫీ చేసి మిగతా రైతులను పక్కకు పెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పోడు భూములకు హక్కు పత్రాలు కల్పించి పోడు చేసుకున్న వారికి రక్షణ కల్పించాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు లింబ్యానాయక్, మండల నాయకులు నరహరి, నర్సింలు ఉన్నారు.

### దరఖాస్తుల వెల్లువ

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని రైతు వేదిక, నిజాంసాగర్ వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతుల నుంచి రుణమాఫీ దరఖాస్తులను స్వీకరించారు. రుణ మాఫీ వర్తించని రైతులు గ్రీవెన్ సెల్ కేంద్రాలకు తరలివచ్చి, రుణ మాఫీ వర్తించేలా చూడాలని వ్యవసాయ అధికారులను కోరారు.

# విద్యార్థుల ఆశయాలు సిద్ధించాలి

**ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి**


తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పోచారం, పక్కన ఆగ్రో చైర్మన్ కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ: పోటీ ప్రపంచంలో విద్యార్థుల ఆశయాలు సిద్ధించాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో రూ.39 లక్షల వ్యయంతో 3 అదనపు తరగతి గదులు, బాలికల ఉన్నత పాఠశాలలో రూ.74 లక్షల వ్యయంతో నిర్మించిన 6 అదనపు తరగతి గదులను రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా పోచారం మాట్లాడుతూ.. ఆస్తులు, అంతస్తులు అరిగిపోతాయని, విద్య మాత్రం నేర్పించిన కొద్ది పెరుగుతూనే ఉంటుందన్నారు. బాన్సువాడ ప్రాంతంలో మొట్టమొదటి గురుకుల పాఠశాల బోర్లం క్యాంపులో ఆడబిడ్డల కోసం ఏర్పాటు చేశానని, ప్రస్తుతం నియోజకవర్గంలో 150 పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణాలకు రూ.50 కోట్లు మంజూరు చేశామని, రూ.11 కోట్లతో 150 అంగన్‌వాడీ భవనాలను నిర్మించామని గుర్తుచేశారు.

**విద్యార్థులకు సన్మానం..**

బాన్సువాడ ప్రభుత్వ కళాశాలలో చదివి నీట్, ఇంజినీరింగ్, డీఈఈసెట్, ఎంసెట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థునులకు ఎమ్మెల్యే పోచారం, ఆగ్రో చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి సలాం, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ఆర్డీవో రమేష్ రాథోడ్, తహసీల్దార్ వరప్రసాద్, మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావు, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, ప్రిన్సిపల్ గంగాధర్, ప్రధానోపాధ్యాయులు విఠల్, కొంతం వెంకన్న, నాయకులు ఉన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


నాటి గురువులతో పలుగుగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1995-96 బ్యాచ్ విద్యార్థులు

దోమకొండ: మండల కేంద్రంలోని పలుగుగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1995–96 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. స్థానిక అగ్రహారం పోశమ్మ ఆలయం వద్ద 23 సంవత్సరాల తర్వాత వారు కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమ గురువులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు సహదేవ్, శంకర్‌గౌడ్, గణేష్, బాలకిషన్, కృష్ణ, సామల నవీన్, నరేష్, సిద్ధరాములు, ప్రసాద్, తదితరులున్నారు.

## పోటీ పరీక్షల్లో రాణించడం అభినందనీయం


నీట్ ర్యాంకర్లతో సీపీ కల్మేశ్వర్

ఖలీల్‌వాడి: పోలీసుల పిల్లలు ఉద్యోగ పోటీ పరీక్షలు, నీట్‌లో రాణించడం అభినందనీయమని సీపీ కల్మేశ్వర్ అన్నారు. నీట్ ర్యాంకులు, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పోలీసు సిబ్బంది పిల్లలను కమిషనరేట్ కార్యాలయంలో సీపీ మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 24 గంటలపాటు విధినిర్వహణలో నిమగ్నమై ఉండే పోలీసు సిబ్బందికి తమ కుటుంబంతో గడిపే సమయం ఉండదన్నారు. ఆ లోటును అధిగమిస్తూ పిల్లలు చదువుల్లో రాణించడం, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. నీట్‌లో ర్యాంకు సాధించిన ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ మోహన్ కుమార్తె ఎ లాస్య, మూడో టౌన్ కానిస్టేబుల్ రఘువర్ధన్ కుమారుడు ఎస్ స్నేహల్, సీసీఎస్ కానిస్టేబుల్ కుమార్తె జె మానసతో పాటు ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్‌గా మోజీరాం కుమార్తె ఆర్ కావేరిని సీపీ సన్మానించారు.

### క్షతగాత్రులను కాపాడబోయి..


రామాగౌడ్(ఫైల్)

దుబ్బాకరూరల్: కారు డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో క్షతగాత్రులకు సాయం చేస్తున్న ఓ వ్యక్తిని మృత్యువు కబళించిన ఘటన దుబ్బాక రూరల్ మండలం చిట్టాపూర్ గ్రామ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్సై హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బీబీపేటకు చెందిన రాజేందర్ తన కుటుంబీకులతో కలిసి కారులో సిద్దిపేట వైపు వెళ్తున్నాడు. అక్బర్‌పేట–భూంపల్లి పీఎస్ పరిధిలోని చిట్టాపూర్ వద్ద జాతీయ రహదారిపై సోమవారం రాత్రి 10 గంటలకు వీరు ప్రయాణిస్తున్న వాహనం డివైడర్‌ను ఢీకొన్నది. అందులో ఉన్న అమూల్య, సిరి చందనకు గాయాలయ్యాయి. చిట్టాపూర్‌కు చెందిన ఇర్కోటి రామాగౌడ్(64) ఇంటి ఎదుటే ఈ ఘటన చోటు చేసుకోవడంతో వెంటనే క్షతగాత్రులను కారు నుంచి బయటకు దించుతున్న ఘటనలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆటో రామాగౌడ్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. అంతేకాకుండా ఆయన పక్కనే ఉన్న మనవాడికి సైతం గాయాలయ్యాయి. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

**క్రైం కార్నర్**

# వేర్వేరు ఘటనల్లో ఐదుగురు మృతి

**చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరు..**


పీర్‌సింగ్(ఫైల్)

నాగిరెడ్డిపేట: చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందిన ఘటన మండలంలోని తాండూర్ శివారులో మంగళ వారం చోటుచేసుకుంది. ఎస్సై మల్లారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బంజార తండాకు చెందిన దేగావత్ పీర్‌సింగ్(39) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. అప్పుడప్పుడు చేపల వేటకు వెళ్తుండేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి చేపలవేటకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. కుటుంబీకులు గ్రామ శివారులోని నాగనయ్య చెరువు వద్ద పరిశీలించగా బైక్, చెప్పులు లభించాయి. గోపాల్‌పేటకు చెందిన ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

**కోటగిరిలో మరొకరు..**

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని దామర చెరువులో చేపల వేటకు వెళ్లిన తోకల రాములు(40) ప్రమాదవశాత్తు వల కాళ్లకు చుట్టుకోవడంతో చెరువులో పడి మృతిచెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన రాములు మంగళవారం చేపల వేటకు వెళ్తున్నట్లు చెప్పి ఇంటికి రాలేదు. కుటుంబీకులు చెరువులో ఈతగాళ్లతో గాలింపు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య తోకల మల్కవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

**మట్టి పెళ్లలు పడి వృద్ధురాలు..**

రుద్రూర్: మట్టి పెళ్లలు పడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన కోటగిరి మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై సందీప్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బొర్లం సాయవ్వ(82) కొడుకు కోడలితో కలిసి మండల కేంద్రంలోని ఓ మట్టి ఇంట్లో ఉంటోంది. కుటుంబీకులు పనుల నిమిత్తం ఇతర గ్రామానికి వెళ్లగా సాయవ్వ ఇంట్లో ఉంటుంది. మంగళవారం అకస్మాతుగా వృద్ధురాలి తలపై మట్టి పెళ్లలు పడి గాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పొందుతూ మృతి చెందింది. వీఆర్‌ఏ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

**రోడ్డు ప్రమాదంలో తాపిమేస్త్రీ ..**


కొండయ్య(ఫైల్)

ఇందల్వాయి: మండలంలోని గన్నారం గ్రామ జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రకాశం జిల్లాకు చెందిన తాపిమేస్త్రీ చిన్నగారి కొండయ్య(38) మృతి చెందినట్లు ఎస్సై మనోజ్ తెలిపారు. ఎస్సై మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఉపాధి నిమిత్తం మూడు నెలలు గా గన్నారంలో ఉంటున్న కొండయ్య ఇందల్వాయి నుంచి గన్నారం వైపు రహదారి పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కొండయ్యకి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి తమ్ముడు బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

### జ్వరంతో విద్యార్థి ..


పీరేందర్(ఫైల్)

లింగంపేట: తీవ్ర జ్వరంతో ఓ బీటెక్ విద్యార్థి మంగళవారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బాయంపల్లి కిషన్‌నాయక్ తండాకు చెందిన సబావత్ చౌహాన్ పీరేందర్(22) ఖమ్మం జిల్లాలో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. ఇటీవల ఇంటికి వచ్చిన అతను ఆదివా రం తీవ్ర జ్వరానికి గురయ్యాడు. గమనించిన కుటుంబీకులు సోమవారం కామారెడ్డిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు హైదరాబాద్‌కు తరలించాలని సూచించారు. కుటుంబీకులు అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మంగళవారం ఉదయం మృతి చెందాడు. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

### ఆత్మహత్యకు యత్నం

నవీపేట: మండలంలోని యంచ శివారులోని గోదావరి నది బ్రిడ్జిపై ఆత్మహత్యకు యత్నించిన తల్లి, కుమార్తె, కుమారుడిని యంచ గ్రామస్తులు కాపాడారు. జిల్లా కేంద్రానికి చెందిన మహిళ తన కుమార్తె, కూతురు, కుమారుడితో కలిసి బాసర వైపు బ్రిడ్జిపై అనుమానాస్పదంగా తిరుగుతుండగా గమనించిన యంచ గ్రామస్తులు వివరాలు ఆరా తీయగా కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. దీంతో వారు బాసర పోలీసులకు సమాచారమివ్వగా వారు అక్కడికి చేరుకున్నారు. భర్తను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి నిజామాబాద్‌కు పంపించారు.

## అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతి

మాక్లూర్: మండలంలోని మాలపల్లి శివారులో ఒకరు అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు ఎస్సై గంగాధర్ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మాలపల్లికి చెందిన నాగుర్ల శ్రీకాంత్(34)కు రెండేళ్ల క్రితం మాక్లూర్ మండల కేంద్రానికి చెందిన శ్రీలతతో వివాహమైంది. వివాహమైన నాటి నుంచి వీరి మధ్య గొడవలు జరుగుతుండేవి. ఆరు నెలల క్రితం భర్తతో గొడవ జరగడంతో శ్రీలత పుట్టింటికి వెళ్లింది. తన భార్యను ఇంటికి తీసుకెళ్దామని ఈ నెల 18న మాక్లూర్‌కు వెళ్లాడు. శ్రీలతను కాపురానికి రావాల ని కోరగా రాఖీ పండుగ తర్వాత వస్తానని చెప్పడంతో అతను వెనుదిరిగాడు. కాగా సోమవారం రాత్రి గ్రామ సమీపంలోని నీటిగుంతలో పడి మృతదేహమై కనిపించాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.
మృతుడి తండ్రి భూమన్న ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### వాహనాల పట్టివేత

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని అర్సపల్లి చౌరస్తాలో వాహనాల తనిఖీ చేపట్టినట్లు ఆరో టౌన్ ఎస్సై మొగులయ్య మంగళవారం తెలిపారు. తనిఖీల్లో రాంగ్ రూట్, మొబైల్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ చేసిన 30 వాహనాలను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఎస్సై వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

## నకిలీ మందుల తయారీలో ఒకరి అరెస్ట్

నిజామాబాద్‌నాగారం: నకిలీ మందులు తయారు చేసి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఔషధ నియంత్రణ శాఖ ఏడీ నర్సయ్య తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రొద్దుటూరుకు చెందిన లక్ష్మీనర్సయ్య అనే వ్యక్తి కామారెడ్డిలో స్థిరపడ్డాడు. నాటి నుంచి నకిలీ మందులు తయారు చేస్తూ విక్రయిస్తుండడంతో 2014లో పోలీసు కేసు నమోదు కాగా విచారణ కొనసాగుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సదరు వ్యక్తిని అరెస్టు చేసి కామారెడ్డి కోర్టులో హాజరు పర్చినట్లు పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిజామాబాద్ అర్బన్ డీఐ శ్రీకాంత్, కామరెడ్డి డీఐ రాజారెడ్డి పాల్గొన్నారు.

### మద్యం మత్తులో దాడి


దాడిలో గాయపడ్డ మహేశ్

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ చౌరస్తా వద్ద మద్యం మత్తులో ఇద్రదు గొడవ పడగా ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పెర్కిట్‌కు చెందిన బండి మహేశ్, ఆకుల ప్రశాంత్ ఒకే దగ్గర పెర్కిట్ కూరగాయల మార్కెట్‌లో కూలీ పనిచేస్తుంటారు. మంగళవారం పనులు ముగించుకున్న ఇద్దరు మద్యం సేవించి గొడవ పడ్డారు. మద్యం మత్తులో ప్రశాంత్ మహేశ్‌పై పదునైన ఆయుధంతో చాతిపై దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. మహేశ్ సోదరి ఇద్దరిని ఆపేందుకు ప్రయత్నించగా ఆమెకు గాయాలయ్యాయి. దాడిచేసిన ప్రశాంత్ అక్కడి నుంచి పరారయ్యాడు. గాయపడిన మహేశ్‌ను స్థానికులు 108 అంబులెన్స్‌లో ర్మూర్ ఏరియా ఆస్పత్రికి తరించలించారు. ఎస్‌హెచ్‌వో రవికుమార్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రశాంత్‌పై మహేష్ సోదరి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### వృద్ధుడి అదృశ్యం


సుదర్శన్

ఖలీల్‌వాడి: నగరంలోని కోట గల్లీకి చెందిన దోమల సుదర్శన్ అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు ఎస్సై శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. సోమవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### తాళం వేసిన ఇంట్లో చోరీ

నవీపేట: మండల కేంద్రంలోని బాలకోటిరెడ్డి ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై వినయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. మూడు రోజుల క్రితం బాలకోటిరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాకు వెళ్లాడు.మంగళవారం ఉదయం ఇంటికి వచ్చే సరికి తాళాలుపగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లో బీరువాలో ఉన్న రూ. 30 వేల నగదుతో పాటు రెండు తులాల బంగారు ఆభరణాలు, వెండిపాత్రలు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపాడు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నా రు.

### కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

రాజంపేట: కుటుంబ కలహాలతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సాలెపల్లి తండాలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన లకావత్ మల్లేశ్(27)కు భార్యాభర్తల మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన మల్లేశ్ సోమవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా గమనించిన కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తల్లి లకావత్ బుట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

**మద్యానికి బానిసై ఒకరు..**

వర్ని(మోస్రా): మద్యానికి బా నిసై ఒకరు ఆత్మహత్య చేసుకు న్న ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణమూర్తి మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన హంగిర్గా మహేశ్(40) కూలీ పని చేస్తూ జీవిస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మానేయాలని మందలించడంతో కుటుంబీకులు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చే సుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైపేర్కొన్నారు.



పెనుగొండ జెడ్పీ హైస్కూల్ స్లాబ్‌కు పరదాలు కట్టిన దృశ్యం.. చదువుకుంటున్న విద్యార్థులు



పెనుగొండ హైస్కూల్‌లోని గదిలోని పెచ్చులూడిన స్లాబ్

# పరదా కడితే.. పడదా?

**పెచ్చులు కిందపడకుండా పరదాలు కట్టిన వైనం**
**పెనుగొండ జెడ్పీ పాఠశాలలో పిల్లల దుస్థితి**

**కేసముద్రం:** తరగతి గదుల్లో స్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్న ఓ బడిలో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువు నెట్టుకొచ్చేస్తున్నారు. తాత్కాలికంగా పరదాలు కట్టి అడ్డు పెట్టినా ఒక్కోసారి పెద్ద పెద్ద పెచ్చులను పరదాలు కూడా ఆపలేకపోతున్నాయి. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పిల్లల దుస్థితి మాత్రం మారలేదు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పెనుగొండ జెడ్పీ హైస్కూల్‌లో 165 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం 9 గదులకు గాను ఒక గది స్టోర్ రూం, మరో గది స్టాఫ్‌కు కేటాయించారు. పాఠశాలలో స్లాబ్ శిథిలావస్థకు చేరుకోవడంతో పెచ్చులు ఊడిపడుతూ, ఇనుప సలాక్‌లు కిందకు వేలాడుతున్నాయి. ఇలా నాలుగు తరగతి గదుల్లో పై పెచ్చులు పడుతుండటంతో వాటిని తప్పించుకునేందుకు పిల్లలు ప్రాణభయంతో బయటకు పరుగులు తీస్తున్నారు. ఇక వర్షం పడినప్పుడల్లా స్లాబ్ కురుస్తుండటం, దాంతో పాటు పెచ్చులు పడుతుండటంతో పిల్లలను పక్కనే ఉన్న డైనింగ్ హాల్‌లో కూర్చోబెడుతున్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాదగిరి తెలిపారు.

# కెమికల్ లోడ్ మాటున గంజాయి తరలింపు

- రూ 1.80 కోట్ల విలువైన సరుకు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్



దమ్మపేట పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్

**దమ్మపేట:** కెమికల్ లోడ్ మధ్యలో గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న రూ 1.80 కోట్ల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ తెలిపారు. దమ్మపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఒడిశా నుంచి కెమికల్ లోడుతో మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాకు వెళ్తున్న డీసీఎం వ్యాన్‌ను దమ్మపేట మండలం అచ్యుతాపురం క్రాస్‌రోడ్డు వద్ద టాస్క్‌ఫోర్స్, సివిల్ పోలీసులు తనిఖీ చేశారు. వాహనం కింద భాగంలో 247 ప్యాకెట్లలో తరలిస్తున్న 508 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నాసిక్ జిల్లాకు చెందిన 12 మంది ముఠాగా ఏర్పడి గంజాయి తరలిస్తున్నారని, అక్కడ చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి పుణె, ముంబై వంటి నగరాల్లో విక్రయిస్తుంటారని ఎస్పీ తెలిపారు. ఈ ముఠాలోని ఆరుగురిని అరెస్ట్ చేశామని, గంజాయి సరఫరా చేసిన కోరాపూట్ జిల్లాకు చెందిన శ్రీనుతోపాటు మిగతా ఆరుగురు పరారీలో ఉన్నారని చెప్పారు. గంజాయి తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించామని, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని పేర్కొన్నారు. గంజాయి నియంత్రణలో తెలంగాణలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రథమ స్థానంలో ఉందని, ఏడాది కాలంలో 62 కేసులు నమోదు చేసి రూ. 20 కోట్ల విలువైన 6,500 కిలోల గంజాయిని సీజ్ చేశామని వివరించారు. సమావేశంలో అశ్వారావుపేట సీఐ కరుణాకర్, టాస్క్‌ఫోర్స్ సీఐ బెల్లం సత్యనారాయణ, ఎస్సైలు సాయికిషోర్‌రెడ్డి, జలకం ప్రవీణ్ పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి భర్త.. ఉరేసుకుని భార్య ఆత్మహత్య

**సంతానం లేకపోవడంతో దంపతుల మధ్య కలహాలు**



మృతిచెందిన దంపతులు గురువయ్య, వెంకటమ్మ(ఫైల్)

**బెల్లంపల్లి రూరల్:** సంతానం కలుగకపోవడం ఆ దంపతుల మధ్య కలహాలకు కారణమైంది. ఘర్షణకు దారితీసి భార్యపై చేయి చేసుకోవడంతో ఆమె ఆస్పత్రి పాలైంది. దీంతో వేదనకు గురైన భర్త క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భర్తకు దూరమై జీవించలేక భార్య ఉరేసుకుని తనువు చాలించింది. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం బుధాకుర్దు గ్రామంలో చోటు చేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై సీహెచ్ రమేశ్, గ్రామస్తుల కథనం ప్రకారం.. బుధాకుర్దు గ్రామ పంచాయతీ పరిధి కాసిరెడ్డిపల్లెకు చెందిన గురువయ్యతో వెంకమ్మ అలియాస్ వెంకటమ్మకు ఇరవై ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కూలి పనులు చేసుకుంటూ వారు జీవనం సాగిస్తున్నారు. ఇన్నేళ్లయినా సంతానం కలుగకపోవడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు తలెత్తేవి. ఒక్కోసారి తీవ్ర ఘర్షణకు దారి తీసేవి. ఈ క్రమంలో గత ఆదివారం గురువయ్య తన భార్య వెంకటమ్మతో గొడవపడి ఆమెను తీవ్రంగా కొట్టడంతో ఆస్పత్రి పాలైంది. తన వల్లే భార్య ఆస్పత్రిపాలు కావడం, మరోవైపు తమకు సంతానం కలగడం లేదని తీవ్ర మనస్తాపానికి గురైన గురువయ్య అదే రోజు క్రిమి సంహారక మందు తాగాడు. బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి చనిపోయాడు. అంత్యక్రియలు పూర్తి చేసిన వెంకటమ్మ.. భర్త మరణాన్ని తట్టుకోలేక సోమవారం అర్ధరాత్రి ఇంటి ముందు ఉన్న చెట్టుకు చీరతో ఉరేసుకుంది. అందరితో కలివిడిగా ఉండే దంపతులు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# కూతురి పెళ్లి డబ్బుల కోసం హత్య

- కల్లు సీసా ఆధారంగా కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

**మహబూబ్‌నగర్ క్రైం:** కూతురి పెళ్లి చేసేందుకు అవసరమైన డబ్బు కోసం పథకం ప్రకారం ఓ మహిళను మరో మహిళ హత్య చేసింది. ఘటనా స్థలంలో దొరికిన కల్లు సీసా ఆధారంగా విచారణ చేసిన పోలీసులు నిందితురాలిని పట్టుకున్నారు. ఈ మేరకు మంగళవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. నవాబ్‌పేటకు చెందిన లక్ష్మమ్మ (48) కొడుకు, కోడలు హైదరాబాద్‌లో ఉండటంతో ఇంట్లో ఒంటరిగా ఉంటుంది. నవాబ్‌పేటకు చెందిన పద్మమ్మకు లక్ష్మమ్మతో పాత పరిచయం ఉండటంతో ఇద్దరూ కలిసి నిత్యం కల్లు తాగేవారు. ఈ క్రమంలోనే పద్మమ్మ ఆర్థిక పరిస్థితులు బాగోలేకపోవడంతో పాటు కూతురి పెళ్లికి డబ్బులు కావాల్సి వచ్చాయి. దీంతో ఎలాగైనా లక్ష్మమ్మను హత్య చేసి ఆమె దగ్గర ఉన్న బంగారం, వెండి తీసుకోవాలని పథకం వేసింది. ఏప్రిల్ 12న రాత్రి ఇద్దరూ కలిసి కల్లు తాగిన తర్వాత లక్ష్మమ్మ నిద్రపోతున్న సమయంలో పద్మమ్మ అర్ధరాత్రి సమయంలో రోకలిబండతో తలపై బాది హత్య చేసింది. ఆ తర్వాత ఆమె దగ్గర ఉన్న 30 తులాల వెండి, ఒక తులం బంగారం, సెల్‌ఫోన్ తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఈ ఘటనపై నవాబ్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ చేయగా ఇంట్లో దొరికిన కల్లుసీసా ఆధారంతో పాటు టెక్నికల్ క్లూస్ సేకరించిన సాక్ష్యాలతో నిందితురాలిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. పద్మమ్మను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తామని డీఎస్పీ చెప్పారు. సమావేశంలో రూరల్ సీఐ గాంధీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్సే కవితకు బెయిల్ ఇప్పిస్తోంది



**ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలతో కేసీఆర్ కుమ్మక్కు: బండి సంజయ్**

**మహేశ్వరం:** కేసీఆర్ కూతురు కవితకు కాంగ్రెస్ పార్టీయే బెయిల్ ఇప్పిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇందుకు సంబంధించిన కేసును కాంగ్రెస్ నుంచి కాబోయే రాజ్యసభ సభ్యుడు అభిషేక్ సింఘ్వీయే కోర్టులో వాదిస్తున్నారని తెలిపారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాలలో మంగళవారం నిర్వహించిన సూర్యగిరి రేణుక ఎల్లమ్మ ఉత్సవాలకు హాజరైన సంజయ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలతో కేసీఆర్ మ్యాచ్ ఫిక్సింగ్ చేస్తున్నారనడానికి ఇదే నిదర్శనమన్నారు. కేసీఆర్ సూచించిన వారికే రాష్ట్రంలో మంత్రి పదవులు, నామినేటెడ్ పోస్టులు, రాజ్యసభ సీట్లు వస్తున్నాయని తెలిపారు. ఈ విషయం తెలిసిన కాంగ్రెస్ నేతలు కేసీఆర్ ఫాంహౌస్‌కు క్యూ కడుతున్నారని వ్యాఖ్యానించారు. అభిషేక్ సింఘ్వీ అనుభవజ్ఞుడైన న్యాయవాది అని, ఆయన తెలంగాణ నుంచి ఎంపీ అయితే రాష్ట్ర ప్రయోజనాల కోసం కోర్టుల్లో, పార్లమెంట్‌లో గట్టిగా వాదిస్తారనుకుంటే .. లిక్కర్ కేసులో అరెస్టయి జైల్లో ఉన్న కవిత బెయిల్ కోసం వాదిస్తున్నారని ఎద్దేవా చేశారు.

# చందాదారులెవరు?

▶ మొదటి పేజీ తరువాయి

దాఖలు చేసిన ఫిర్యాదును కొట్టివేస్తూ ఉమ్మడి హైకోర్టు 2018 డిసెంబర్ 31న తీర్పునిచ్చింది. అయితే అనంతరం ఈ తీర్పును సవాల్ చేస్తూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (వైఎస్సార్ సీపీ హయాంలో) సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేశాయి. మరోవైపు తీర్పులో కొంత భాగంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మార్గదర్శి, రామోజీరావు కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లు అన్నింటిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం హైకోర్టు ఇచ్చిన తీర్పును 2024 ఏప్రిల్ 9న కొట్టివేసింది. హైకోర్టు తీర్పును తప్పుబడుతూ.. మార్గదర్శి డిపాజిట్ల సేకరణకు సంబంధించి వాస్తవాలను నిగ్గు తేల్చాల్సిందేనని స్పష్టం చేసింది. ఉండవల్లి, ఏపీ సర్కార్ సహా అందరి వాదనలు వినాలని పేర్కొంది.

**మార్గదర్శి అక్రమాలను ఆర్బీఐ కౌంటర్‌లో తేల్చింది..:** సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసులో తెలంగాణ హైకోర్టు తాజాగా మరోసారి విచారణ ప్రారంభించింది. సీనియర్ జడ్జి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టాలన్న అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్ రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వాన్ని, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)ని ప్రతివాదుల జాబితాలో చేర్చింది. గత విచారణ (ఈనెల 6వతేదీన) సందర్భంగా కౌంటర్ దాఖలుకు చివరి అవకాశం ఇవ్వాలన్న ఆర్‌బీఐ వినతికి అంగీకరిస్తూ ఇకపై ఈ పిటిషన్లను మోషన్ లిస్ట్‌లో పేర్కొనాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ క్రమంలో మార్గదర్శి ఫైనాన్షియర్స్ వసూలు చేసిన డిపాజిట్లన్నీ చట్టవిరుద్ధం, అక్రమమేనని, అందుకు బాధ్యులను ప్రాసిక్యూట్ చేయాలని నివేదిస్తూ ఈ నెల 13న ఆర్బీఐ తెలంగాణ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసింది. ఈ క్రమంలో మంగళవారం జస్టిస్ సుజోయ్‌పాల్ నేతృత్వంలోని ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, కోర్టు సహాయకులుగా మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ఆన్‌లైన్‌లో హాజరయ్యారు. ఏపీ ప్రభుత్వ న్యాయవాదితోపాటు తెలంగాణ ప్రభుత్వం తరఫున న్యాయవాది పల్లె నాగేశ్వర్‌రావు, ఆర్బీఐ న్యాయవాది కె.రతంగపాణిరెడ్డి హాజరయ్యారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారిస్తూ చట్టం 45 (ఎస్)ను ఉల్లంఘించినట్లు ఆర్బీఐ కౌంటర్‌లో తేల్చిందని ఈ సందర్భంగా ఉండవల్లి హైకోర్టు దృష్టికి తెచ్చారు. దీని ఆధారంగా మార్గదర్శిపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని నివేదించారు. దాదాపు 70 వేల మంది చందాదారుల వివరాలను 1,500కిపైగా పేజీల్లో మార్గదర్శి సుప్రీం కోర్టుకు సమర్పించిందని, ఆ వివరాలను హైకోర్టుకు కూడా పెన్‌డ్రైవ్‌లో అందజేసేలా ఆదేశించాలని కోరారు. దీనిపై జస్టిస్ సుజోయ్‌పాల్ స్పందిస్తూ.. వివరాలు కోరుతూ ఓ అఫిడవిట్ దాఖలు చేయాలని, ఆ మేరకు ఆర్బీఐ, మార్గదర్శికి ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొంటూ తదుపరి విచారణను వాయిదా వేశారు.

# అందరినీ అనుమతించాం

**బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మ**

**తంగళ్లపల్లి(సిరిసిల్ల):** రాఖీ పండుగ రోజున విద్యార్థినుల తల్లిదండ్రులు, సోదరులను గురుకులంలోనికి అనుమతించామని రాజన్న సిరిసిల్ల జిల్లా బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మ చెప్పారు. మంగళవారం ఆమె కలెక్టర్‌కు వివరణ ఇస్తూ లేఖ రాశారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి పాఠశాలకు విద్యార్థుల తల్లిదండ్రుల రాక మొదలు కాగా, జోనల్ ఆఫీసర్ సూచనల మేరకు అనుమతించామన్నారు. మధ్యాహ్నం 1.40 గంటలకు ఒకేసారి ఎక్కువ మొత్తంలో విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చారని, చిన్న గేటు ద్వారా చెక్ చేస్తూ పంపించామని చెప్పారు. కాగా, కిటికీల ద్వారా రాఖీలు కట్టిన తమ పిల్లలను పాఠశాలలో ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉందని, కాబట్టి జిల్లా అధికారులు సమగ్ర విచారణ జరిపి విద్యార్థినులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# స్కానింగ్ సేవలకు మంగళం

- రేడియాలజిస్టులు లేక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లలో ఇబ్బందులు
- ప్రైవేట్ సెంటర్లకు పరుగులు పెడుతున్న గర్భిణులు



మోర్తాడ్ ఆస్పత్రిలోని స్కానింగ్ యంత్రం

**మోర్తాడ్(బాల్కొండ):** గర్భిణులైన మోర్తాడ్‌కు చెందిన స్రవంతి, ఏర్గట్ల మండలం గుమ్మిర్యాలకు చెందిన లక్ష్మి స్కానింగ్ కోసం మోర్తాడ్ ఆస్పత్రికి రాగా, ఇక్కడ రేడియాలజిస్టు లేకపోవడంతో స్కానింగ్ చేయలేమని ఆర్మూర్‌లోని ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌కు వెళ్లాలని వైద్య సిబ్బంది సూచించారు. గత్యంతరం లేని పరిస్థితిలో ప్రైవేట్‌కు వెళ్లి డబ్బులు చెల్లించి స్కానింగ్ చేయించుకున్నారు. ఇది ఒక్క స్రవంతి, లక్ష్మికి ఎదురైన పరిస్థితి కాదు. ఎంతో మంది పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన గర్భిణులు స్కానింగ్ కోసం డబ్బులు ఖర్చు చేసుకోవాల్సి వస్తోంది. సామాజిక ఆస్పత్రులకు గత ప్రభుత్వం స్కానింగ్ యంత్రాలను సమకూర్చినప్పటికీ రేడియాలజిస్టులను నియమించకపోవడంతో స్కానింగ్ సేవలు కొనసాగడం లేదు. మోర్తాడ్, బాల్కొండ, ధర్పల్లి, డిచ్‌పల్లి, కోటగిరి, వర్ని, నవీపేట్ కమ్యూనిటీ ఆస్పత్రులతోపాటు బోధన్ ఏరియా, ఆర్మూర్‌లోని వంద పడకల, జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రులకు స్కానింగ్ యంత్రాలు మంజూరయ్యాయి. గైనకాలజిస్టులు, మత్తు వైద్యుల పోస్టులతోపాటు రేడియాలజిస్టు పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. స్కానింగ్ సేవలు జిల్లా జనరల్ ఆస్పత్రుల్లేనే అందుతున్నాయి. మహిళలు గర్భందాల్చిన నాటి నుంచి ప్రసవం వరకు మూడుసార్లు స్కానింగ్ చేయించుకోవాల్సి ఉంటుంది. స్కానింగ్ కోసం ఒక్కోసారి రూ.2వేల నుంచి రూ.3వేల వరకు ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌ల నిర్వాహకులు వసూలు చేస్తున్నారు.

**ప్రభుత్వం దృష్టి సారిస్తేనే..**

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు గత ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేసింది. గర్భిణులకు పోషకాహారం అందించడంతోపాటు ప్రసవం అనంతరం కేసీఆర్ కిట్ అందజేశారు. లక్షలు వెచ్చించి స్కానింగ్ యంత్రాలు కొనుగోలు చేసినా రేడియాలజిస్ట్ పోస్టులను భర్తీ చేయకపోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ స్పందించి రేడియాలజిస్టులను నియమించి కమ్యూనిటీ ఆస్పత్రుల్లో స్కానింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

**పోస్టుల భర్తీతోనే పరిష్కారం**

వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో వైద్యుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. త్వరలోనే వైద్యుల నియామకం జరగనుంది. రేడియాలజిస్ట్ పోస్టులు కూడా భర్తీ చేయనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే స్కానింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.
– డాక్టర్ శివ శంకర్, జిల్లా వైద్య విధాన పరిషత్ అధికారి

## హాస్టళ్లపై ఇంటెలిజెన్స్ ఆరా

**నిజామాబాద్‌అర్బన్:** జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలపై ఇంటలిజెన్స్ ఆరా తీస్తోంది. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అనుగుణంగా నాణ్యమైన భోజనం అందించడం లేదని బిల్లులు మాత్రం అధిక మొత్తంలో పొందుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఇంటెలిజెన్స్ అధికారులు ఆయా సంక్షేమ వసతి గృహాల వివరాలు సేకరిస్తున్నారు. ఇటీవల 'సాక్షి' దినపత్రికలో సంక్షేమ వసతి గృహాల్లోని బోగస్ బిల్లులపై కథనం ప్రచురితమైంది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న అధికారులు సంక్షేమ వసతి గృహాలపై నిఘా సారించారు. గత వారం రోజుల క్రితమే సంక్షేమ వసతి గృహాలకు సంబంధించి ప్రతినెలా సమర్పించే బిల్లులను పరిశీలించడం ప్రారంభించారు. కొన్ని వసతి గృహాల్లో విద్యార్థులను ఎక్కువగా చూపించి మిగిలిన బియ్యాన్ని బయట విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కంఠేశ్వర్ ప్రాంతంలోని వసతిగృహం నుంచి రాత్రివేళ బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం ఉంది. ఓ మహిళా వసతిగృహ అధికారి ఫిబ్రవరిలో ఏకంగా తొమ్మిది లక్షల బిల్లులు పొందడం, మరో వసతి గృహం అధికారి ప్రతినెల ఒకటో తేదీనే బియ్యం అందినట్లు దానిని ప్రతినెల 25వ తేదీలోగా పూర్తిస్థాయిలో వినియోగించినట్లు ఎనిమిది నెలలుగా బిల్లులు సమర్పిస్తున్నారు. వాస్తవానికి సంక్షేమ వసతి గృహాలకు బియ్యం 15 నుంచి 20 తేదీలోగా వస్తాయి కానీ ఒకటో తేదీ లోపే సమర్పించడంపై అధికారులు ఆరాతీస్తున్నారు. కొందరు సెలవుల్లో సైతం భోజనం పెట్టినట్లు బిల్లులు సమర్పించారని, దీనిపై కూడా అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. ఇటీవల ఏసీబీ అధికారుల తనిఖీలతో వసతి గృహాల్లో లోపాలు అనేకం బయట పడుతున్నట్లు తెలిసింది. వీటిపైన అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు.

# తెరుచుకున్న టెండర్లు

- చేప పిల్లల పంపిణీకి ముందుకొచ్చిన గుత్తేదార్లు
- త్వరలో ఫిష్ ఫారాల పరిశీలన
- ఫైనాన్షియల్ బిడ్‌ను తెరవనున్న అధికారులు



**డొంకేశ్వర్(ఆర్మూర్):** ఎట్టకేలకు చేప పిల్లల పంపిణీకి సంబంధించిన టెండర్లు తెరుచుకున్నాయి. బకాయి బిల్లుల విషయంలో గుత్తేదార్లను సముదాయించడంతో నలుగురు వ్యక్తులు టెండర్లు దాఖలు చేశారు. దీంతో మత్స్య శాఖ అధికారులు ప్రక్రియను వేగవంతం చేశారు. టెండర్లలో పాల్గొన్న గుత్తేదార్ల వివరాలను రాష్ట్ర శాఖకు పంపించారు. ఎవరెంత కోట్ చేశారో తెలుసుకునేందుకు త్వరలోనే ఫైనాన్షియల్ బిడ్‌ను తెరవనున్నారు. జిల్లాలో ఈ ఏడాది 967 చెరువుల్లో ఉచితంగా 4.54కోట్ల చేప పిల్లలను వదలాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జూలై నెలాఖరులోనే అధికారులు టెండర్లు పిలువగా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. ఆగస్టు 5వరకు గడువు పెంచినప్పటికీ అదే పరిస్థితి ఉండడంతో మరోసారి గడువు పెంచి కాంట్రాక్టర్లతో మాట్లాడారు. బకాయిలు బిల్లులిస్తామని నచ్చజెప్పడంతో నలుగురు టెండరు వేశారు. ప్రస్తుతం టెండర్లు తెరిచిన అధికారులు గుత్తేదార్లకు సంబంధించిన చేప పిల్లల కేంద్రాలను పరిశీలించనున్నారు. ఫిష్ ఫారాలు నిజంగా ఉన్నాయా? ఉంటే ఎంత సామర్థ్యం ఉంది? ఎన్ని లక్షల చేప పిల్లలు పెంచుతున్నారు? అవి నాణ్యమైనవేనా? అని చూస్తారు. అంతా సవ్యంగా ఉంటే అధికారులు ఫైనాన్షియల్ బిడ్‌ను తెరుస్తారు. ఎవరు తక్కువ కోట్ చేస్తే వారికే చేప పిల్లలు పంపిణీ చేసే కాంట్రాక్టు దక్కుతుంది. అయితే గుత్తేదార్లు రింగై టెండరు దాఖలు చేసినట్లు తెలుస్తోంది. గతేడాది ఇలాగే జరగడంతో నాణ్యత లేని చేప పిల్లలు సరఫరా చేసినట్లు మత్స్యకారులు ఆరోపించారు.

**త్వరలో ఫిష్ ఫారాల పరిశీలన**

చేప పిల్లలను చెరువుల్లో వదిలేందుకు టెండర్లు నిర్వహించి వాటిని తెరిచాం. టెండరులో పాల్గొన్న కాంట్రాక్టర్ల వివరాను రాష్ట్ర శాఖకు పంపించాం. క్షేత్రస్థాయిలో ఫిష్ ఫారాలను పరిశీలించి టెక్నికల్ బిడ్‌కు వెళ్తాం. కలెక్టర్ అనుమతితో చెరువుల్లో చేప పిల్లలను వదులుతాం. నాణ్యత విషయంలో రాజీ పడేది లేదు.
– ఆంజనేయస్వామి, జిల్లా మత్స్యశాఖ అధికారి

# కొనసాగుతున్న జూడాల నిరసన



కలెక్టర్‌తో మాట్లాడుతున్న జూడాలు

**నిజామాబాద్‌నాగారం:** కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార ఘటనలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేసును నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేశారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదుట జూనియర్ డాక్టర్ల(జూడా) నిరసన కొనసాగుతోంది. ఏడో రోజైన మంగళవారం జీజీహెచ్ ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీహనుమంతు, సీపీ కల్మేశ్వర్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. జీజీహెచ్‌లో భద్రతాసిబ్బంది సంఖ్యను పెంచాలని, మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా జూడా అధ్యక్షుడు డాక్టర్ జితిన్, కార్యదర్శి డాక్టర్ ఆశీష్, ఉపాధ్యక్షులు డాక్టర్ కార్తీక్, డాక్టర్ గ్రీష్మ పాల్గొన్నారు.

# ట్యాంకర్లతో పొలానికి నీరు



తిమ్మానగర్‌లో ట్యాంకర్లతో వరి పంటకు నీరందిస్తున్న రైతు కుమ్మరి శేఖర్

**పిట్లం(జుక్కల్):** తగిన వర్షాలు లేకపోవడంతో నీరు అందక పంటలు దెబ్బతింటున్నాయి. పంటలను కాపాడుకోడానికి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రానికి చెందిన రైతు కుమ్మరి శేఖర్‌కు తిమ్మానగర్ గ్రామ శివారులో మూడున్నర ఎకరాల వ్యవసాయ భూమి, ఒక మోటారు బోరు ఉంది. వర్షాలు కురుస్తాయని ఆశతో వరి పంటను సాగు చేసాడు. అయితే వర్షాభావంతో పాటు మోటారు బోరు గ్యాప్ ఇవ్వడంతో పంటకు నీరు అందక పొలం మొత్తం నెర్రలు బారి ఎండిపోతోంది. దీంతో పంటను ఎలాగైనా బతికించాలనే ఉద్దేశంతో రైతు మంగళవారం అద్దెకు తెచ్చిన వాటర్ ట్యాంకర్ సహాయంతో వరి పంటకు నీరు అందించే ప్రయత్నం చేశాడు. మూడు ట్యాంకర్ల నీటిని పొలంలో పోసినా సరిపోక నెర్రల నుంచి నీరు భూమిలోకి వెళ్లిపోయింది. దీంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు.

# మొక్కుబడిగా మొక్కల పెంపకం

- గ్రామాల్లోని నర్సరీల్లో సక్రమంగా జరగని మొక్కల ఉత్పత్తి
- నిర్వహణ సరిగా లేకపోవడంతో మధ్యలోనే చనిపోయిన మొక్కలు
- ఖాళీగా దర్శనమిస్తున్న కవర్లు
- పట్టించుకోని అధికారులు



తుంకిపల్లి నర్సరీలో చెట్లుగా మారిన మొక్కలు



మొక్కలు లేక మట్టితో ఉన్న ఖాళీ బ్యాగులు

**నిజాంసాగర్(జుక్కల్):** ప్రతి ఊరిలో 10 వేల మొక్కలు నాటడం లక్ష్యంగా వన నర్సరీలను ఏర్పాటు చేసినా మొక్కల పెంపకంపై గ్రామ పంచాయతీ, మండల అధికారులు నిర్లక్ష్యం వహించారు. రాష్ట్రం ప్రభుత్వం వన మహోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నా క్షేత్రస్థాయిలో మాత్రం మొక్కుబడిగా మొక్కలు నాటి అధికారులు చేతులు దులుపుకున్నారు. నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండలాల్లో 27 గ్రామ పంచాయతీలకు గాను 2.7 లక్షల మొక్కల పెంపకం లక్ష్యంగా పెట్టుకున్నారు అధికారులు. అయితే ఒక్కొక్క గ్రామ పంచాయతీలో 10 వేల మొక్కల చొప్పున ఈజీఎస్, పంచాయతీ అధికారులు నర్సరీలను సిద్ధం చేశారు. నర్సరీల్లో మొక్కల ఉత్పత్తి సక్రమంగా జరుగకపోవడంతో ఖాళీ కవర్లు దర్శన మిస్తున్నాయి. మొత్తం 2.7 లక్షల మొక్కలు నాటాల్సి ఉండగా వన మహోత్సవం కింద 93 వేల మొక్కలు నాటినట్లు ఈజీఎస్ అధికారులు లెక్కలు చూపుతున్నారు. ప్రతి ఇంటికీ రెండు, మూడు మొక్కల చొప్పున 47 వేల మొక్కలు పంపిణీ చేశారు. మిగితా మొక్కలు వన నర్సరీల్లోనే దర్శన మిస్తున్నాయి. వన మహోత్సవం కింద మొక్కలు నాటినా మిగితా మొక్కలు సంగతిని ఈజీఎస్, పంచాయతీ అధికారులు విస్మరించారు. అయితే కొన్ని గ్రామ పంచాయతీల్లో మాత్రం గ్రామ పంచాయతీ సిబ్బంది ట్రాక్టర్లల్లో మొక్కలను అటవీ ప్రాంతానికి తరలిస్తున్నారు. అక్కడ కూలీలు ఇష్ట మొచ్చినట్లు మొక్కలు నాటారు. మరికొన్ని గ్రామ పంచాయతీల్లో మొక్కలను అటవీ ప్రాంతంలోని ముళ్ల పొదల్లో కుప్పలు, కుప్పలుగా పడవేసినట్లు తెలిసింది.

**నర్సరీల్లోనే చెట్లుగా మారుతున్నాయ్..**

మహమ్మద్‌నగర్ మండలంలోని తుంకిపల్లి, గాలీపూర్, సింగితం గ్రామ పంచాయతీ వన నర్సరీల్లోని మొక్కలు చెట్లుగా మారుతున్నాయి. ఆయా వన నర్సరీల్లో పెంచిన మొక్కలను రహదారుల వెంట అటవీ ప్రాంతాల్లోని ఖాళీ ప్రదేశాల్లో లక్ష్యం మేర నాటకపోవడంతో చెట్లుగా దర్శమిస్తున్నాయి. అంతేకాకుండా మిగితా గ్రామ పంచాయతీల్లో మొక్కలను నాటకుండా అటవీ ప్రాంతాల్లో కూలీలు ఇష్టానుసారంగా వదిలేశారు. అధికారులు ఇకనైనా స్పందించి మొక్కల పెంపకం లక్ష్యం నెరవేరేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.